# సాక్ష్యం

సి.హెచ్.మధు

వాన్ని వీడెందుకు కొట్టాడో వీన్ని వాడెందుకు కొట్టాడో తనకు తెలియదు.

వానికి వీనికి వున్న తగాదా ఏమిటో తనకు తెలియదు.

వాడు వీని మీద కోర్టు కెందుకు పోయాడో వీడు వాని మీద కోర్టు కెందుకు వెళ్ళాడో తనకు తెలియదు.

ఆ ఇంటి మీది కాకి ఈ ఇంటి మీద, ఈ ఇంటి మీది కాకి ఆ ఇంటి మీద ఎందుకు వ్రాలదో తనకు తెలియదు.

వారిద్దరి మధ్య ఆస్తి తగాదాలు, డబ్బు తగాదా లున్నాయా? అంటే లేవని చెప్పొచ్చు.

ఇద్దరు అన్న దమ్ములే. రక్తం పంచుక పుట్టిన అన్న దమ్ములే.

ఒకడు తనకు అన్నవుతాడు. ఇంకొకడు తనకు తమ్ముడవుతాడు.

తన ఇంటికి అటు ప్రక్క వానిల్లు ఇటు ప్రక్క వీనిల్లు మధ్యన తన ఇల్లు అలా పంపకాలు జరిగాయి.

వీరిద్దరి తగువుల మధ్య తాను చిక్కుకున్నాడు. తనకు ఎవరితో తగాదాలు లేవు.

వీరిద్దరి తగువులకు కారణాలు లేవు. వాని కష్టం వీడు తినలేదు. వీడి కష్టం వాడు తినలేదు. తండ్రి సంపాదించిన భూమిలో అందరమూ బ్రతుకుతున్నాము. తగాదా ఎందుకూ?

వీడొక పార్టీ వాడొక పార్టీ అన్నదొక పార్టీ తమ్ముని దొక పార్టీ వీడిదో రాజకీయం, వాడిదో రాజకీయం. రాజకీయాల కక్షలు తగాదాల వరకు తలలు కొట్టుకునే వరకెళ్లి కోర్టుకెళ్లాయి.

కోర్టులో కేసు. ఊరు చిన్నదే ఐదు వందలు దాటని గడప. మూడు వేలు దాటని జనాభా. మంచి వ్యవసాయ వనరులున్న గ్రామం. అన్ని కులాలు కల్పి మెల్పి ఎవరి పని వారు చేసుకొంటున్న గ్రామం. అందరూ అన్న దమ్ముల లాగా వూరిలో కల్పి వుండేవారు. కానీ ఇటీవల పార్టీ రాజకీయాలు పెరిగి పార్టీ తగాదాలు పెరిగి వూరు రెండుగా చీలిపోయింది. ఊరులో రెండు వర్గాలు, రెండు గ్రూపులు. రెండు వర్గాల మధ్య ఘర్షణలు, శాంతిలేదు. కలహాలు పెరిగాయి, శ్రమ తగ్గింది. ఊరు సంపద తగ్గింది. గ్రామ ప్రజలకు అప్పులు పెరిగాయి. కల్లు, సారా దుకాణాలలో గిరాకీ పెరిగింది.

ఈ ఊరులో వచ్చిన వాతావరణంలో భాగంగానే అన్నా తమ్ముల కొట్లాట.

కోర్టులో కేసు





అన్న తల మీద తమ్ముడు కట్టెతో కొట్టాడని — కొట్టిన మాట నిజమే. తాను చూచాడు.

తనను సాక్ష్యమివ్వమని అన్నంటాడు.

ఇవ్వకూడదని తమ్ముడంటాడు.

"తమ్ముణివి కావా! నన్ను వాడు కొట్టలేదా నీవు చూడలేదా నిజం చెప్పడానికేముంది" అంటాడు అన్న.

"సాక్ష్యమిచ్చి నన్ను జైలుకు పంపిస్తావా? నేను


కొత్త సీరియల్స్

* పార్ట్ టైమ్ హజ్బెండ్

అనబడు

అద్దెకో భర్త

మరియు

* జడలో జాబిలి

తమ్ముణ్ని కాదా?'' అంటాడు తమ్ముడు.

తనకు తోచడం లేదు. ''ఈ తగాదాలు వద్దని కల్సి వుండమని, రాజకీయాలు కూడు పెట్టవని ఈ రాజకీయాలు మన మధ్య చీలికలు తెచ్చాయని, తగాదాలు పెంచాయని'' నచ్చ చెప్పాను ఎవ్వడూ వినడు.

పైగా బెదిరిస్తున్నారు.

''సాక్ష్యం చెప్పకపోతే నీ సంగతేమిటో చూస్తానని'' అన్న

''సాక్ష్యం చెపితే నీ అంతు చూస్తానని'' తమ్ముడు

తనకు అర్థం కావడం లేదు. తనకంతా అయోమయంగా వుంది. ఏం సాధించడానికి ఈ తగాదాలు ఎవన్ని ఉద్ధరించడానికీ రాజకీయాలు.

సాక్ష్యం చెప్పవలసిన రోజు రేపో ఇవ్వాళ తన మీద ఒత్తిడి తప్పదు ఏం చేయాలి?

తమ్ముడొచ్చాడు

''అన్నా సాక్ష్యం చెపుతావా రేపు?''

''చెపుతాను''

''నన్ను జైలుకు పంపాలని వుంది కదూ నీకు''

''నిజం చెపుతాను నిన్ను కొట్టింది నిజమా కాదా?''

''చెపుతావా?''

''చెపుతాను కోర్టు కేసు విత్ డ్రా చేసుకోండి! మీ యిద్దరి మధ్య పరిష్కారం చేస్తాను.

''నీ నీతి మాకక్కర్లేదు. నీవు సాక్ష్యం చెపితే నీ పని ...?'' అంటూ కత్తి తీశాడు.

తాను సిద్ధంగానే వున్నాడు జేబులో నుండి కత్తి తీసి ''నీకే వుందారా కత్తి, నాకూ వుంది పొడిచేస్తాను'' అన్నాను. మెరుస్తున్న కత్తి చూచి తమ్ముడు వెనుక అడుగువేశాడు.

తమ్ముడు వెళ్ళిన అరగంటకు అన్న వచ్చాడు.

''రేపు కోర్టులో సాక్ష్యం చెపుతావా లేదా?''

''చెప్పను''

''నిజం చెప్పడానికేముంది?''

''మీరు రాజకీయాలలో పడి తన్నుకొన్నారు. మీ రాజకీయాలు నాకు అక్కర్లేదు.''

''అంతేనా?''

''అంతే కోర్టులో కేసు వదులుకొంటే మీ ఇద్దరి మధ్య పరిష్కారం చేస్తాను.''

''నీ నీతి మాకు అక్కర్లేదు సాక్ష్యం చెపుతావా లేదా?''

''చెప్పను''

''అంతేనా?''

అంతే—?''

''నీ గతి''

తనకు కోపమొచ్చింది. తయారుగా పెట్టుకున్న పెద్ద కర్ర తీసి ఏం చేస్తావు? ఏదో అన్నవని పెద్దవానివని వూరుకొంటున్నాను లేదా తల బద్దలు కొట్టేవాన్ని. మీ రాజకీయాలు మీరు మధ్యన నన్ను బెదిరిస్తున్నారు. పెద్దగా ఎవన్నో ఉద్ధరించినట్టు తగాదాలు అల్లరి పోలీసులు కోర్టులు శ్రమ మంది పాలు! మీ బెదిరింపులకు భయపడదల్చుకోలేదు. నాకు కత్తులున్నాయి, కర్రలున్నాయి ఏం చేస్తారో నేనూ చూస్తాను'' అన్నాడతను.

పిల్లిలా వెళ్ళిపోయాడు అన్న.

■



# కాంపస్ జోక్స్

## క్వాలిఫికేషన్

మన ప్రాచీన తెలుగు కావ్యాలకు అర్థ తాత్పర్యాలు చెప్పే విద్యార్థులు ఎవ్వరూ లేరినాడు. ఆ మాటకొస్తే అధ్యాపకుల లోనూ తక్కువే. ఒక కావ్యానికి చక్కగా ప్రతిపదార్థ తాత్పర్యాలు వ్రాసి వ్యాఖ్యానం కూడా ఇస్తే ఆ విద్యార్థికి ఎం.ఫిల్. ఇవ్వాలనే తీర్మానం ప్రవేశపెట్టాలి'' అన్నారు ఒక ఆచార్యులు.

సభలోంచి ఒకరు లేచి ''తెలుగు విద్యార్థి తెలుగ కావ్యానికి అర్థ తాత్పర్యాలు రాయడం కష్టం. ఎందుకంటే ప్రాచీన కావ్యంలో మూడు వంతులు సంస్కృత పదాలుంటాయి. అలా వుండడంవల్లనే ఆ కావ్యం అర్థం కాదు. సంస్కృతం ఎం.ఎ. చదువుకున్న విద్యార్థికి ఈ రకమైన ఎం.ఫిల్. ఇస్తే బాగుంటుంది'' అన్నారు.




మరో వైపునించి మరొకరు లేచి ''అలా అంటానికి వీలు లేదు. ప్రాచీన కాలపు తెలుగు పలుకుబడులు కూడా చాలా మందికి అర్థం కావు. తెలుగు భాషా శాస్త్రంతో పరిచయం వుంటే తప్ప అన్ని పదాలకు వ్యాఖ్యానం రాయడం కష్టం. తెలుగు విద్యార్థికే ఈ ఎం.ఫిల్. డిగ్రీ దక్కాలి'' అన్నారు.

ఇరు వైపులనించీ వాగ్వాదాలు చెలరేగి వ్యక్తిగత దూషణల స్థాయికి పెరిగే సరికి అధ్యక్షులవారు ఖంగారుపడిపోయి ''విద్యార్థిని మొదట సంస్కృతం ఎం.ఎ. తర్వాత తెలుగు ఎం.ఎ. చదివేక అప్పుడు ప్రాచీన కావ్యానికి అర్థ తాత్పర్యాలు వ్యాఖ్యానాలు రాయమందాం. దానికి ఎం.ఫిల్. డిగ్రీ ఇచ్చేలాగ తీర్మానం చేద్దాం. ఆ వ్యాఖ్యానాన్ని అచ్చువేసే విషయం ఆ విద్యార్థి ఉద్యోగావకాశాల విషయం తర్వాత ఆలోచిద్దాం'' అన్నాడు ఉభయ పక్షాలకు రాజీ కుదురుస్తూ.

— డాక్టర్
సి. ఆనందారామం

ఓ క్లయింటు ఆస్తి విషయమై లాయరు సలహా తీసుకున్నాడు. అందుకు గాను ఏభై రూపాయిలకు ఒక బిల్, ఇరవై రూపాయిలకు మరొక బిల్ పంపించాడు లాయర్.

''నేను మీ వద్ద ప్రస్తావించింది ఒక విషయమే గదా- రెండు బిల్లులు పంపారేమిటి?'' అనడిగాడు క్లయింటు.

''ఒకటి లీగల్ ఎడ్వయిజ్ కి. రెండవది- మీరు తిరిగి వెళ్తూ! బస్ స్టాండు ఎక్కడ? అనడిగారు. నేను సమాధానం చెప్పాను''

- వై. విజయ, విజయవాడ

# కామంచి చెట్టు

కామంచి చెట్టును కాచి బెట్టు అని కూడా అంటారు. ఈ చెట్టును హిందీలో 'మకోయ్' అని, తమిళంలో 'మణిత్త క్కాళి' అని, ఇంగ్లీషులో GARDEN NIGHT SHADE అని, లాటిన్‌లో SOLANUM NIGRUM LINN అని పేరు. ఈ చెట్టు కూడా సాధారణంగా పెరళ్ళలో పెరిగేదే. సుమారు మూడు అడుగుల ఎత్తు వరకూ పెరుగుతుంది. దీని కాయలు మొదట ఆకుపచ్చగా వుండి బాగా పండిన పిదప ఎర్రగా మారుతాయి. ఈ కాయలను గాజు కాయలు అని కూడా అంటార. కామంచి చెట్టు ఆకు కూరగా కూడా వండి తినవచ్చు. పండిన కాయలను ఎండబెట్టి 'వరుగు'గా ఎత్తిపెట్టి, కావలసినప్పుడు కొద్దిగా నూనె చల్లి వేయించి. ఉప్పు కారం చల్లి అన్నంలో కలుపుకొని కూడా తింటాం.



తమిళ దేశంలో ఈ వరుగుతో పులుసు చేసి 'వత్తకొళంబు' అనే పేరుతో ఆహారంలో వాడుతారు.

కామంచి చెట్టు ఆకులు, కాయలు, పండ్లు మగతనాన్ని పెంచుతాయని, వార్థక్యాన్ని దాట వేస్తాయనీ, కుష్టు లాంటి చర్మ రోగాన్ని కూడా పోగొడుతాయని ఆయుర్వేదాచార్యులు శ్రీ చరకాచార్యులు తమ 'చరక సంహిత'లో తెలిపారు.

కామంచి ఆకులు కంఠస్వరానికీ, కండ్లకూ మేలు చేస్తాయనీ, శరీరంలో వాపు, అతిమూత్ర వ్యాధి, ఎక్కిళ్ళు, మూల వ్యాధి (పైత్య) వాంతి, గుండె జబ్బులు, మలబద్ధకం పోగొడుతాయని శ్రీ భావమిశ్రాచార్యులు తమ 'భావ ప్రకాశం' అనే గ్రంథంలో చెప్పారు.

కామంచి ఆకులను పెసల పప్పు చేర్చి కూర వండి కొన్నాళ్ళు తింటే కామాల తగ్గిపోతుంది. నోటిలో పుండు, కడుపులో పుండు ఆరిపోతుంది. ఉమ్మితో రక్తం పడడం తగ్గిపోతుంది. పది ఆకులను నోట్లో వేసుకుని నమిలినా నోటిలో పుండ్లు తగ్గుతాయి.

కామంచి ఆకులు లివర్ స్ప్లీన్ జబ్బులను తగ్గిస్తాయనీ, సోరియాసిస్ అనే చర్మ రోగంలో కూడా లాభదాయకంగా వున్నాయని ఇటీవల పరిశోధనలలో గుర్తించబడింది.

— ఆయుర్వేద శిరోమణి
రాజరాజేశ్వర శర్మ